# వింతమానసి

"మహేశ్వర్"

ఆమె ఎంత శ్రావ్యంగ పాడుతూందో! అతనికి వినబడలేదూ? ఎప్పుడూ ఏదో బాధ? అందరూ హేళన చేస్తారతన్ని! ఎవరూ అతనితో మాట్లాడరేం? శరీరంలో బలంలేదు! హృదయంలో శాంతి లేదు! 'శరీర మిలా శుష్కిస్తూందేం?' అని ఎవరూ ప్రశ్నించరేం? లోకానికి అతను అక్కర్లేదూ? ఆ ఎముకలు ఎలా అగుబడుతున్నై! నరాలు నాట్యంచేస్తున్నై!

ఎక్కడికో వెళ్ళిపోతాడు ఎండలో! 'వెన్నెలం' టాడు! వర్షంతో ఇల్లు చేరుకుంటాడు!

'పన్నీటిజల్లు' అంటాడు.

'దేశదిమ్మరి' అంటుంది నోరున్న గుడ్డిలోకం!

* * *

ఆయ నెలా జీవిస్తున్నాడు?

అడగడ నికి ఎవరికైనా సానుభూతివుందా?

ఎప్పుడైనా తిండి తింటాడా?

మ రెలా జీవిస్తున్నాడు??

ఎందుకలా తిరుగుతున్నాడు???

మనశ్శాంతిలేక! అంతేనా!ఆఁ..

* * *

బ్రతికి చెడ్డ రోజులు!

బంధువులంతా బారలావల వున్నారు. ప్రయోజనం...?

అంతా తిడ్తారతన్ని! ఎంతని సహించగలడా జీవి!

ఎప్పుడూ ఏదో వ్రాస్తూ కూర్చుంటాడు. తననే చిత్రించుకుంటాడు.

'ఆకలీ' అంటాడు.

'కన్నీరు కావాలోయ్' అంటాడు!

'ఎడారి ఒంటె' అయిపోతాడు.

స్వేచ్ఛావిహారం అతని వాంఛ!

'ప్రేమగీతాల్ని' ఆలాపించాలంటాడు. తన తండ్రి మంచంమీద ఉన్నాడు. మందులేదు! మారు - దిక్కు లేదు! డాక్టర్ని పిలిస్తే?

డబ్బివ్వందీ ఆ 'హేట్' రానన్నాడు. 'బుట్ట'లో పడాల్సిన అతన్ని ఒకప్పుడు ఈయనే రక్షించేడు.

యిదీ కృతజ్ఞత! కృతఘ్నత!!

* * *

దైవకృపవల్ల ఆగండం గడిచి బయటపడ్డారు.

పూర్వపు ఇల్లే మారిపోయింది; ఆ యింట్లో...ఆయన డాక్టరు. ఎన్నిమార్లు చెప్పుకున్నా రాడే! డాబామీద పేకాట!

ఈతని దురవస్థకి దురపిల్లి ప్రకృతి వగచింది.

నాల్గుచుక్కలు రాలాయి!

ఈత డక్కడ ఉండలేక పోయాడు. అతన్ని వెతక నెవ్వరూ వెళ్ళలేదు!

ఆతల్లి ఎంతో పరితపించింది అతని వియోగంకి. 'ఎందుకు వెళ్ళిపోయావ్?' ఏమీలేదు! జలజలా కన్నీరు కారింది. అంతే!

'పిచ్చిబాబు' అన్నారు.

* * *

ఉన్న స్నేహితుల్లో ఉత్తముడ్ని ఊరువిడచి పోవాల్సొచ్చింది.

మూడు నెలలకో లేఖ చేరిందీతనికి 'నారాత బాగులేదుకదూ!' అని! అతడు వచ్చాడు. దినాలు గడచిపోతున్నై. ఇలాగెన్ని?

'నేను జీవించి ఎందుకూ?' అంటాడు.

'ఎందుకా? దేశక్షేమానికీ! లోకకళ్యాణానికీ! మానవ అభ్యుదయానికీ!'

అంతా తిడ్తారే పిచ్చిబాబని!

అతని రచనలు తూలనాడ్తారే! ఎందుకు? అర్థం గాక!

అతని జీవితపథంలో పంటలు లేవు!

అందుకే అతనికి ఆకలి మంటలు!

అవే లోకానికి గంటలు!

అందరి హృదయాల్లో మంటల గంటలు!

ఓచిన్న ఉద్యోగం దొరికింది.

అదీ ఆనందపరచలేదు!

పూర్వపు ధోరణే!

'ఆశ' అనేది ప్రపంచంలో ఇక 'నిరాశే' అన్నాడు.

'కన్నీటికెరటాల్లో', 'మంటల నావలో', ఒంటరి ప్రయాణం!

బయల్దేరిపోయా డెక్కడికో!

ఎక్కడికెళ్ళినా ఏదీ శాంతి?

తిరిగివచ్చి, తిరుగ వెళ్ళేడు.

తండ్రితో దేశాంతరం!

అచట 'శాంతిస్థాపన' చేసుకుందామని! ఎవ రతడు?

"వింత మానసి!"